ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 46 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | శుక్రవారం 20 సెప్టెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# 2026 మార్చి నాటికి నక్సలిజం అంతం చేస్తాం: అమిత్ షా

**మావోయిస్టులు హింసను, ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలని కేంద్ర హెూంమంత్రి అమిత్ విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఆపరేషన్ నిర్వహిస్తామని హెచ్చరించారు.**



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: ఇటీవల ఛత్తీస్ గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులు దాడులు పెరిగిపోతున్నాయి. ఈనేపథ్యంలో 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని కేంద్ర హెూమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. హింసను వీడి లొంగిపోవాలని మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్గఢ్ నక్సల్స్ హింసాకాండలో 55 మంది బాధితులను ఉద్దేశించి ఆయన శుక్రవారం ఈమేరకు వ్యాఖ్యానించారు. దేశంలో మావోయిస్టుల హింస, భావజాలాన్ని నిర్మూలించి శాంతిని నెలకొల్పాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించుకున్నారని అమిత్ పేర్కొన్నారు. మావోయిస్టులు ఒకప్పుడు పశుపతినాథ్ (నేపాల్) నుంచి తిరుపతి వరకు కారిడార్ ఏర్పాటుచేయాలని భావించారని కానీ, మోదీ నేతృత్వంలో దాన్ని ధ్వంసం చేశామన్నారు. ఈసందర్భంగా హింసను, ఆయుధాలను వదిలేసి లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే మావోయిస్టుల అంతానికి ఆల్- అవుట్ ఆపరేషన్ నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఛత్తీస్ గఢ్ ని నాలుగు జిల్లాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిపిన ఆపరేషన్లలో భద్రతా బలగాలు గణనీయమైన విజయాన్ని సాధించారన్నారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో మావోయిస్టుల హింసాకాండ బాధితులకు హెూం వ్యవహారాల మంత్రిత్వశాఖ త్వరలో సంక్షేమ పథకాన్ని రూపొందిస్తుందన్నారు. ఉద్యోగాలు, ఆరోగ్య సంరక్షణతో పాటు సంక్షేమ కార్యక్రమాల ద్వారా బాధితులకు సహాయం అందిస్తామని షా వెల్లడించారు.

# తిరుమల లడ్డూపై వివాదం.. బాధ్యులపై కఠిన చర్యలు :డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**తిరుమల లడ్డూ వివాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.**




అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: తిరుమల లడ్డూ వివాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఎక్స్'లో ఓ సంస్థ ఫిర్యాదు చేస్తూ పెట్టిన పోస్టుకు ఆయన రిప్లై ఇచ్చారు. ఈ అంశంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు. వైకాపా హయాంలో ఉన్న తితిదే బోర్డే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగించడం అందరి మనోభావాలనూ దెబ్బతీసిందన్నారు.

## సనాతన ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆలయాల్లో జరిగే అంశాల పర్యవేక్షణకు జాతీయ స్థాయిలో 'సనాతన ధర్మరక్షణ బోర్డు' ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని పవన్ అభిప్రాయపడ్డారు. దీనిపై అన్ని వర్గాల వారితో జాతీయస్థాయిలో చర్చ జరగాలన్నారు. సనాతన ధర్మానికి ఏ రూపంలో ముప్పు వచ్చినా మనమంతా కలిసికట్టుగా నిర్మూలించాలని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో తితిదే మహాప్రసాదమైన లడ్డూల తయారీలో వినియోగించిన నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వంటివి కలగలసి ఉండొచ్చనే అనుమానాన్ని గుజరాత్కు చెందిన నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్డీడీబీ) కాఫ్ లిమిటెడ్ సంస్థ వ్యక్తం చేసినట్లు తెదేపా తెలిపింది. ఈ నెయ్యిలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని, అందులో పాలకు సంబంధించినవి కాకుండా ఇతరత్రా కొవ్వులు (ఫారిన్ ఫ్యాట్స్) కలగలిసి ఉన్నట్లు ఆ పరీక్షల్లో వెల్లడైందని వివరించింది. దీనిపై పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. ఈ విషయంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# తిరుమల లడ్డూ వివాదం.. వెంటనే నివేదిక ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశం

**తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: శ్రీవారి లడ్డూ తయారీలో అపవిత్ర పదార్థాలు వినియోగించిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్గా ఉంది. అత్యంత పవిత్రమైన తిరుమలలో జరిగిన ఈ అపచారంపై ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఆందోళనలు, భక్తుల ఆవేదనను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థ సారథితో పాటు ఉన్నతాధికారులతో తిరుమల అంశంపై సీఎం సమీక్షించారు. లడ్డూ తయారీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై ఈ రోజు సాయంత్రంలోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని తితిదేఈవోను ముఖ్యమంత్రి ఆదేశించారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్లతో చర్చించి చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు. భక్తుల విశ్వాసాలు, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని సీఎం చంద్రబాబు అన్నారు.

## చంద్రబాబుతో మాట్లాడిన కేంద్రమంత్రి నడ్డా..

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఆరా తీశారు. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని కోరారు.

# ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించండి: సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి

**ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం.. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: ఉద్యోగుల సమస్యలపై దృష్టిసారించి వాటిని పరిష్కరించాలని తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం.. రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏపీలో పని చేస్తున్న తెలంగాణ ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకువచ్చే విషయంపై ఈరోజు సాయంత్రం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరింది. పదేళ్లకుపైగా ఏపీలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటూ పనిచేస్తున్న 100 మంది నాల్గోతరగతి ఉద్యోగులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు సీఎం చొరవ చూపాలని సంఘం ప్రధాన కార్యదర్శి కందూరి గంగాధర్ కోరారు. హైదరాబాద్ నాంపల్లిలోని సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో తాము కూడా భాగస్వాములమయ్యామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సీఎం సహాయనిధికి ఒకరోజు వేతనాలను అందజేసినట్లు తెలిపారు. పెండింగ్లో ఉన్న తమ ఉద్యోగుల డీఏలను విడుదల చేయడంతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని గంగాధర్ కోరారు.

# లడ్డూ నాణ్యతపై ప్రమాణం చేసేందుకు వైవీ సుబ్బారెడ్డి సిద్ధమా?: లోకేశ్

**తితిదే మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. లడ్డూ నాణ్యతపై ప్రమాణం చేసేందుకు ఆయన సిద్ధమా అని ప్రశ్నించారు.**



బంగారుపాళ్యం, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: తితిదే మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. లడ్డూ నాణ్యతపై ప్రమాణం చేసేందుకు ఆయన సిద్ధమా అని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో లోకేశ్ పర్యటించారు. 'ఉత్తమ కార్యకర్త- మన టీడీపీ యువ ఛాంపియన్స్', ప్రజా దర్బార్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారని తెలిసి షాక్ అయ్యా. లడ్డూ తయారీ నెయ్యిలో కల్తీ చేశారని నివేదికలు వచ్చాయి. దేవుడి దగ్గరకూడా రాజకీయాలు చేశారు. ప్రజాప్రభుత్వం తితిదేను ప్రక్షాళన చేస్తుంది. తిరుమల పవిత్రతను కాపాడే విధంగా చర్యలు తీసుకుంటాం. కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదలను. క్యాన్సర్ గడ్డలా మారిన పాపాల పెద్దిరెడ్డిని వదిలిపెట్టం. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వానికి ఇవ్వని మెజార్టీని మాకు ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటాం...సమస్యలు తీరుస్తాం. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం. వైకాపా నేతలు చేసిన తప్పులను ప్రక్షాళన చేస్తున్నాం. పూతలపట్టు, బంగారుపాళ్యం గ్రామాలు నా గుండెల్లో ఉంటాయి. గతంలో ఓ డీఎస్పీ నాపై దాడి చేస్తే ప్రజలు మాకు అండగా ఉన్నారు. అని లోకేశ్ తెలిపారు.

# దురుద్దేశంతోనే అసిస్టెంట్‌గా చేర్చుకున్నారు.. జానీ మాస్టర్ రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

**కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఉప్పరపల్లి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగుచూశాయి.**



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్కు ఉప్పరపల్లి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో ఆయనను చంచల్గూడ జైలుకు తరలించారు. రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగుచూశాయి. నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. "2019లో జానీతో బాధితురాలికి పరిచయం ఏర్పడింది. దురుద్దేశంతోనే ఆమెను అసిస్టెంట్గా చేర్చుకున్నాడు. 2020లో ముంబయిలోని హెూటల్లో ఆమెపై లైంగిక దాడి చేశాడు. అప్పుడు బాధితురాలి వయసు 16ఏళ్లు. నాలుగేళ్లలో బాధితురాలి పై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. విషయం బయటకు చెబితే సినిమా అవకాశాలు రాకుండా చేస్తానని బెదిరించాడు. తన పలుకుబడిని ఉపయోగించి బాధితురాలికి సినిమా అవకాశాలు రాకుండా అడ్డుకున్నారు. జానీ మాస్టర్ భార్య కూడా బాధితురాలిని బెదిరించారు" అని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

# వైకాపా అంతమైనట్లే.. సజ్జల, విజయసాయిరెడ్డి కూడా ఉండరు: షర్మిల

**తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీపై కేంద్ర హెూంశాఖకు లేఖ రాస్తామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు.**



అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: తిరుమల లడ్డూలో కల్తీపై కేంద్ర హెూంశాఖకు లేఖ రాస్తామని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ వ్యవహారం పై సీబీఐ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. "గవర్నర్ను కలిసి లడ్డూ కల్తీ వ్యవహారంపై ఫిర్యాదు చేస్తాం. వైకాపా విశ్వసనీయతను కోల్పోయింది. వైఎస్ఆర్ మంచి పేరు సాధిస్తే.. జగన్ చెడ్డపేరు తెచ్చుకున్నారు. హామీలు అమలు చేయకుండా గతంలో మోసం చేశారు. రుషికొండపై ఆయన కబ్జాలు చేశారు. వైఎస్ఆర్కు జగన్కు పొంతనే లేదు. వైకాపా అంతం అయినట్లే.. ఆ పార్టీలో జగన్ తప్ప ఎవరూ మిగలరు. సజ్జల, విజయసాయిరెడ్డి కూడా అందులో ఉండరు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి" అని షర్మిల తెలిపారు.

# ముంబయి నటి ఫిర్యాదు.. వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ అరెస్ట్


**బాలీవుడ్ నటి కాదంబరీ జత్వానీపై తప్పుడు కేసు పెట్టిన వ్యవహారంలో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: బాలీవుడ్ నటి కాదంబరీ జత్వానీపై తప్పుడు కేసు పెట్టిన వ్యవహారంలో వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ను పోలీసులు అరెస్టు చేశారు. జత్వానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాల సాయంతో వేరే రాష్ట్రంలో ఉన్న విద్యాసాగర్ను అరెస్టు చేశారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు విద్యాసాగర్ తన స్నేహితుడి మొబైల్ వినియోగించారు. అయినా, సాంకేతికత సాయంతో నిందితుడిని పట్టుకున్నారు. ఫోర్జరీ పత్రంతో తనపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేశారని జత్వానీ ఇటీవల ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇందులో ఐపీఎస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్ని కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ను ఏ1గా చేర్చారు. అతనితో పాటు మరికొందరు అని ఎఫ్ఐఆర్ పేర్కొన్నారు. తప్పుడు ఆధారాలను సృష్టించడం, నేరానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం, పత్రాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు రికార్డులను తయారు చేయడం, తదితర ఆరోపణలపై ఐపీసీలోని 192, 211, 218, 220, 354 (డి), 467, 420, 469, 471 రెడ్ విత్ 120 (బి), ఐటీ చట్టంలోని 66ఏ సెక్షన్ల కింద కేసు పెట్టిన విషయం తెలిసిందే.

# వైఎస్ జగన్ సిపాయిల తిరుగుబాటును మళ్లీ గుర్తు చేశారు :సీబీఐ మాజీ డైరెక్టర్

**తిరుమల లడ్డూల్లో కల్తీ నెయ్యి వివాదం పై సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు సంచలన ట్వీట్ చేశారు.**



విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: తిరుమల లడ్డూల్లో కల్తీ నెయ్యి వివాదం పై సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు సంచలన ట్వీట్ చేశారు. 1857 సిపాయిల తిరుగుబాటుకు జంతువుల కొవ్వు ఉన్న తూటాల వినియోగమే కారణమని ఆయన గుర్తు చేశారు. 177 ఏళ్ల తరువాత జరిగిన సిపాయిల తిరుగుబాటు ఘటనను వైకాపా అధినేత జగన్ మళ్లీ గుర్తు చేశారంటూ వ్యాఖ్యానించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి సరఫరా చేసిన నెయ్యిలో ఫిష్ ఆయిల్ (చేపనూనె)తోపాటు గొడ్డు, పందికొవ్వు నుంచి తీసిన నూనెలు వినియోగంపై ఆయన సోషల్మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. జగతోపాటు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డిలపై 153ఏ, 295ఏ కింద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



## వైకాపా కౌన్సిలర్ నన్ను చెప్పుతో కొట్టాడు :బాధిత మహిళ ఆరోపణ

వైకాపా పాలనలో వేధింపులకు గురైన మహిళలు మీడియా ఎదుటకు వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.



పలమనేరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: వైకాపా పాలనలో వేధింపులకు గురైన మహిళలు మీడియా ఎదుటకు వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వైకాపాకు చెందిన కౌన్సిలర్ ఒకరు తనను అనేకసార్లు లైంగికంగా వేధించాడని, చెప్పుతో కూడా కొట్టాడని ఓ బాధిత మహిళ మీడియా ఎదుట ఆరోపించింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన ఓ మహిళ వాలంటీర్ గా పనిచేసేది. ఆ సమయంలో ఆమె భర్త అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో భర్త వైద్య ఖర్చుల కోసం.. అదే పట్టణానికి చెందిన కౌన్సిలర్ హైదద్ వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టి కొంత డబ్బు తీసుకుంది. కొన్ని రోజుల తర్వాత ఆ మహిళ డబ్బు చెల్లిస్తానని. తన బంగారం తిరిగివ్వాలని హైదర్ను కోరింది. హైదర్.. ఆ బంగారాన్ని ఆమెకు తిరిగి ఇవ్వకపోగా అసభ్య పదజాలంతో దూషించాడని, తన పిల్లలను చంపేస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు బాధిత మహిళ తెలిపింది. అంతేకాకుండా బంగారం తిరిగి ఇవ్వమని అడిగినందుకు తనపై, తన కుటుంబసభ్యులపై హైదర్ దాడికి చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. స్థానికులు గాయపడిన తమను పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారని, ప్రస్తుతం చికిత్స పొందుతున్నామని మీడియా ఎదుట వాపోయింది. దీనిపై అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది.

## ఎస్సీ, ఎస్టీ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నిరసన

ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిరసన కార్యక్రమం చేపట్టారు.




విజయవాడ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విజయవాడలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన మెస్, కాస్మోటిక్ ఛార్జీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు శాశ్వత భవనాలను నిర్మించి, ఖాళీగా ఉన్న వాచ్మెన్, కుక్ వంటి పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా ఛార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## అంత తక్కువ ధరకు నాణ్యమైన నెయ్యి ఎలా ఇస్తారు?: తితిదే ఈవో

తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోన్న వేళ తితిదే ఈవో శ్యామలరావు స్పందించారు.



తిరుమల, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోన్న వేళ తితిదే ఈవో శ్యామలరావు స్పందించారు. "శ్రీవారి లడ్డూ నాణ్యతపై కొంతకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. నాణ్యతపై పోటు సిబ్బందితో మాట్లాడాను. వారు కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. లడ్డూ నాణ్యతగా ఉండాలంటే. నెయ్యి నాణ్యంగా ఉండాలని చెప్పారు. నెయ్యి నాసిరకంగా ఉందని గుత్తేదారుకు చెప్పాం. నెయ్యిలో నాణ్యతా లోపాన్ని నేను కూడా గమనించాను. నెయ్యి నాణ్యత నిర్ధరణకు తితిదేకు సొంత ప్రయోగశాల లేదు. నెయ్యి నాణ్యతపై అధికారులు గతంలో పరీక్షలు చేయలేదు. నాణ్యత నిర్ధరణ కోసం బయట ల్యాబ్పు ఆధారపడాల్సిన పరిస్థితి. రూ.411కే కిలో నెయ్యి సరఫరా చేశారు. నాణ్యమైన నెయ్యిని అంత తక్కువ ధరకు సరఫరా చేయలేరు. మేం హెచ్చరించిన తర్వాత గుత్తేదారులు నాణ్యత పెంచారు" అని ఈవో తెలిపారు.

### జంతువుల కొవ్వు నెయ్యిలో కలిసినట్టు తేల్చిన ఎన్డీడీబీ

"నాలుగు ట్యాంకర్లలో నెయ్యిని జులై 6న.. 10 ప్రయోగశాలలకు పంపాం. నెయ్యి నాణ్యత నిర్ధరణ కోసం ఎన్డీడీబీ ల్యాబ్కు పంపాం. ఎన్డీడీబీ చాలా ప్రముఖమైనది గుజరాత్లోని ఆనంద్ లో ఉంది. ల్యాబ్ పరీక్షల్లో నెయ్యి నాణ్యత లేదని, భారీగా కల్తీ జరిగినట్టు నివేదికలు వచ్చాయి. వారంలో ల్యాబ్ నివేదికలు రెండు విభాగాలుగా ఇచ్చారు. నెయ్యి నాణ్యత 100 పాయింట్లకు బదులు 20 పాయింట్లే ఉంది. జంతువుల కొవ్వు నెయ్యిలో కలిసినట్టు ఎన్డీడీబీ తేల్చింది. తమిళనాడుకు చెందిన ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యిలో కల్తీ జరిగింది. నెయ్యి కల్తీ అయ్యిందని తేలిన వెంటనే చర్యలకు ఉపక్రమించాం. ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కమిటీ వేశాం. భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. నెయ్యి కల్తీ పరీక్ష కోసం బయటకు పంపడం తితిదే చరిత్రలో ఇదే తొలిసారి" అని ఈవో శ్యామలరావు చెప్పారు.

## హిందూ ధర్మంపై భారీ కుట్ర.. కఠిన చర్యలు తీసుకోండి: చంద్రబాబుకు బండి సంజయ్ లేఖ

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది క్షమించరాని నేరమని.. దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై దుమారం చెలరేగిన వేళ.. సీఎం చంద్రబాబుకు బండి సంజయ్ లేఖ రాశారు. "ఈ వ్యవహారం శ్రీవారి భక్త కోటిని, యావత్ ప్రపంచంలోని హిందుల మనోభావాలను తీవ్రంగా కలచివేస్తోంది. తిరుమల పవిత్రతను దెబ్బతీశారని, అన్యమత ప్రచారం జరుగుతోందని గతంలో ఫిర్యాదులు వచ్చినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఎర్రచందనం కొల్లగొడుతూ ఏడు కొండలవాడిని రెండు కొండలకే పరిమితం చేశారని చెప్పినా స్పందించలేదు. జంతువుల కొవ్వును లడ్డూ ప్రసాదంలో వినియోగించారని మీరు చేసిన వ్యాఖ్యలతో కల్తీ నిజమేనని యావత్ హిందూ సమాజం భావిస్తోంది. ప్రసాదంలో జంతువుల కొవ్వు వినియోగించడం అత్యంత నీచం. దీన్ని హిందూ ధర్మంపై జరిగిన భారీ కుట్రగానే భావిస్తున్నాం. లడ్డూ ప్రాముఖ్యతను తగ్గించేందుకు తితిదేపై కోట్ల మంది భక్తులకు ఉన్న విశ్వాసాన్ని సడలించేందుకు ఈ కుట్ర చేశారు.. క్షమించరాని నేరానికి ఒడిగట్టారు" "అన్యమతస్తులకు తితిదే పగ్గాలు అప్పగించడం, ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం వల్లే ఈ దుస్థితి వచ్చింది. ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం లేనిదే ఏళ్ల తరబడి ఈ కల్తీ దందా జరిగే అవకాశం లేదు. సీబీఐతో విచారణ జరిపిస్తేనే సమగ్ర దర్యాప్తు జరిగి వాస్తవాలు నిగ్గు తేలే అవకాశముంది. ఈ విషయంలో అంతిమ నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే. రాజకీయ ప్రయోజనాలను పూర్తిగా పక్కన పెట్టి హిందువుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. తక్షణమే సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోండి" అని చంద్రబాబును బండి సంజయ్ కోరారు.

## నీట్ కౌన్సెలింగ్.. తెలంగాణ విద్యార్థులకు ఊరట

నీట్ కౌన్సెలింగ్లో స్థానికత వ్యవహారంలో తెలంగాణ విద్యార్థులకు ఊరట లభించింది. హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కౌన్సెలింగ్ సమయం అతి తక్కువగా ఉండటంతో ఈ ఒక్కసారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొంది.



దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: నీట్ కౌన్సెలింగ్లో స్థానికత వ్యవహారంలో తెలంగాణ విద్యార్థులకు ఊరట లభించింది. హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు కౌన్సెలింగ్కు హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కౌన్సెలింగ్ సమయం అతి తక్కువగా ఉండటంతో ఈ ఒక్కసారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. స్థానికత వ్యవహారంపై హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఒక్కసారికి హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు అవకాశం ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాదులు తెలిపారు. స్థానికతను నిర్ధరిస్తూ నాలుగు రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని గుర్తు చేశారు. అన్ని తీర్పులు స్పష్టంగా ఉన్నా.. మళ్లీ కోర్టును ఆశ్రయించారన్నారు. ఆ వాదనతో విద్యార్థుల తరఫు న్యాయవాది విభేదించారు. కేవలం రెండు, మూడేళ్లు చదువుల కోసం రాష్ట్రానికి దూరంగా ఉంటే స్థానికతను దూరం చేయకూడదని వాదించారు. మెరిట్స్లోకి వెళ్లేంత సమయం ఇప్పుడు లేదని.. రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని సీజేఐ సూచించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ విద్యార్థుల భవిష్యత్, ప్రస్తుత సమయాభావం కారణంగా కౌన్సెలింగ్కు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణకు ప్రతివాదులందరికీ ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపినందున హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్కు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.


## సీఐడీ అధికారి విజయ్పాల్ ముందస్తు బెయిల్ పిటిషన్ పై తీర్పు రిజర్వు

అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి సీఐడీ అధికారి విజయపాల్ పై గుంటూరు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం విజయాపాల్ దాఖలు చేసిన పిటిషన్పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది. ఈ నెల 24న ఈ కేసులో ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం తెలిపింది. రఘురామకృష్ణరాజు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, హైకోర్టు న్యాయవాది ఉమేష్ చంద్ర వాదనలు వినిపించారు. ఈ కేసులో ఏ1గా ఉన్న పోలీసు ఉన్నతాధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును ఇటీవల సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని రఘురామ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో గత ప్రభుత్వంలో పోలీసులు తప్పులు చేశారని స్పష్టమవుతోందన్నారు. తప్పు చేసిన అధికారి.. ఇప్పుడు ముందస్తు బెయిల్ కోరడం సమంజసం కాదన్నారు. ఇరు వైపులా వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రిజర్వు చేసింది.




## ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం: సీఎం చంద్రబాబు

ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.



ఒంగోలు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో' కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు పేదల ఇళ్లకు వెళ్లి వారి కష్టాలు తెలుసుకుని సహాయం అందించాలని సూచించారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో సీఎం పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో జగన్ పర్యటనలో పరదాలు కట్టేవారు. డ్వాక్రా సంఘాల మహిళలను లాక్కుని వచ్చేవారు. మహిళలు రాకపోతే పింఛన్, రేషన్ కోత విధించే పరిస్థితి. వైకాపాని భూస్థాపితం చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. అందుకే గతంలో ఎన్నడూ చూడని విధంగా కూటమికి విజయం కట్టబెట్టారు. ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నుంచి పింఛన్ అందిస్తున్నాం" అని వివరించారు.

## వేధింపులపై ఫిర్యాదుకు మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి: మంత్రి సీతక్క

పని ప్రదేశంలో మహిళలపై వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి సీతక్క తెలిపారు.



హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: పని ప్రదేశంలో మహిళలపై వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి సీతక్క తెలిపారు. సీఐఐ ఇండియన్ వుమెన్ నెట్వర్క్ ఆధ్వర్యంలో నాయకత్వం అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉన్నత స్థానాల్లో ఉన్న స్త్రీలు తోటి వారికి తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. గ్రామీణ యువతకు తగిన ప్రోత్సాహం అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమతుందని చెప్పారు. ప్రతి మహిళ తల్లి, సోదరి స్థానంలో ఉండి. ఆలోచించి యువతకు తగిన తోడ్పాటు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధి పనులకు వెళ్లే స్త్రీల రక్షణ కోసం ఇటీవల టీ సేఫ్ యాప్ను పోలీసు శాఖ తీసుకొచ్చిందని సీతక్క చెప్పారు.

## తెలుగు భాషాభివృద్ధికి ఏయన్నార్ కృషి మరువలేనిది: మండలి

కృష్ణాజిల్లా అవనిగడ్డలో దివిసీమ లలిత కళాసమితి, గాంధీక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో దిగ్గజ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.




అవనిగడ్డ, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: కృష్ణాజిల్లా అవనిగడ్డలో దివిసీమ లలిత కళాసమితి, గాంధీక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో దిగ్గజ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ .. అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగు భాషాభివృద్ధికి అక్కినేని చేసిన కృషిని కొనియాడారు. ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు, దివిసీమ ఉప్పెన బాధితులకు ఎన్టీఆర్, ఏయన్నార్ విరాళాలు సేకరించి అండగా నిలిచిన తీరు మరువలేనిదన్నారు. తన పిల్లలు తెలుగు భాషకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తెలుగు చిత్ర పరిశ్రమను మద్రాస్ నుంచి హైదరాబాద్కు తీసుకొచ్చేందుకు ఏయన్నార్ ఎనలేని కృషి చేశారని తెలిపారు. అనేక తెలుగు సాంస్కృతిక సంస్థలకు అక్కినేని అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. అదే విధంగా అక్కినేనితో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

## నందిగం సురేశ్ నివాసంలో సోదాలకు పోలీసుల యత్నం

గుంటూరు, (రిపబ్లిక్ న్యూస్), సెప్టెంబర్ 20: వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్ నివాసంలో సోదాలకు మంగళగిరి పోలీసులు యత్నించారు. ఉద్దండరాయునిపాలెంలోని ఆయన నివాసంలో తనిఖీలు చేపట్టేందుకు వెళ్లారు. కానీ ఇంట్లో పెద్దవారెవరూ లేకపోవడంతో సోదాలు చేయలేదు. మంగళగిరి పీఎస్కు రావాలని అక్కడ ఉన్నవారికి నోటీసులు ఇచ్చారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ఇటీవల నందిగం సురేశ్ను పోలీసులు అరెస్టు చేశారు. కస్టడీలో ఆయన వెల్లడించిన సమాచారం ఆధారంగా సోదాలకు వెళ్లారు. ఇటీవల రెండు రోజుల విచారణలో భాగంగా నందిగం సురేష్కు 45 ప్రశ్నలు వేసి పోలీసులు సమాచారం రాబట్టారు. అత్యధిక ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోయినా కేసు దర్యాప్తులో కీలకమైన నాలుగైదు ప్రశ్నలకు అవసరమైన సమాధానం చెప్పారని సమాచారం. వైకాపా కేంద్ర కార్యాలయంలో ప్రెస్మీట్ ఉందని, దానికి హాజరుకావాలని సమాచారమిచ్చి పిలిపించారని, అందుకే తాను ఆరోజు అక్కడికి వెళ్లానని బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ పోలీసులకు వెల్లడించారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచే మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి కుట్ర జరిగిందని పోలీసులు నిర్ధారించుకున్నారు.



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# నడి సెంటర్లలో బిక్షమెత్తుకుంటున్న బాల్యం

## పిల్లలతో భంగాకు విక్రయాలు సాగిస్తున్న ముష్టి మాఫియా

- నిద్రపోతున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు
- దుకాణాలలో మగ్గిపోతున్న చిన్నారులు
- నిర్లక్ష్యంగా బాలకార్మిక నిర్మూలన అధికారులు
- కార్యాలయాలు ఉన్న తనిఖీలు సున్నా

**జిల్లా కేంద్రం నంద్యాల నడి సెంటర్లలో చిన్నారులు, పిల్లలు బిక్షమెత్తుకుంటున్న పట్టించుకొనే నాధుడే కరువయ్యాడు. ఏదో మారుమూల ప్రాంతంలో చిన్నారులతో బిక్షం ఎత్తిస్తున్నారని అనుకున్నారంటే మీరు పొరబడ్డట్టే నిత్యం వేల మంది పట్టణ ప్రజలు, అధికారులు, న్యాయ శాఖమంత్రి ఎన్ ఎండి ఫరూఖ్ కార్యాలయంకు ప్రతి రోజు వెళ్లే దారిలో ఉన్నసెంటర్లు శ్రీనివాససెంటర్, సంజీవనగర్ గేట్, బస్టాండ్ ప్రాంతాలలో నెలలు నిండిన చిన్నారులతో కొందరు కిలాడి మహిళలు బిక్షమెత్తుకుంటూ ఉంటారు.**

నాయకులతో సత్సంబంధాలు పెట్టుకొని ఎవరైన సామాజిక కార్యకర్తలు పిల్లలతో బిక్షమెత్తించడం తప్పని చెబితే వారిని బెదిరిస్తుండటంతో వీరి మాఫియాకు అడ్డం లేకుండా పోతుంది. బిక్షమెత్తిస్తుంటే తనిఖీలు చేసి వారిని ప్రభుత్వ సెంటర్లలో, దత్తత కేంద్రంలో చేర్చాల్సిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. కేవలం కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు బాలకార్మిక దినోత్సవం రోజున వారోత్సవాలు, పక్షోత్సవం, మాసోత్సవాల పేరిట అట్టహాసంగా లక్షల రూపాయలతో కార్యక్రమాలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. స్త్రీ శిశు పిల్లలతో ఎర్రని ఎండలో ఒంటిపైన షర్టు కూడా లేకుండా గాంధీ వేషధారణలో ప్రతి రోజు నడిసెంటర్ లో బిక్షవె-ఎత్తిస్తున్న అధికారుల కంట మాత్రం కనబడదు. అంతే కాకుండా రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాలలో బంగాకు విక్రయించే ముఠా బిక్షమెత్తుకునే పిల్లలను తమ స్వార్థం కోసం బంగాకు విక్రయం కోసం వాడుకుంటున్నారు. ఒకవేళ పోలీసులకు బంగాకు విక్రయిస్తూ దొరికిన మైనర్ల పై కేసు తీవ్రత తక్కువగా ఉంటుందని ఈ ఉచ్చులో చిన్నారులను బలిచేస్తున్నారు. క్రాంతినగర్ నుండి చాపిరేవుల మధ్యలో నివాసం ఉంటున్న బిక్షగాళ్ళ ముఠా చాపిరేవులలోని క్రింది స్థాయి రాజకీయ సంక్షేమ శాఖ కార్యాలయం ఉన్న తనిఖీలు సున్నాగా ఉండటంతో చిన్నారులను బిక్షగాళ్ళుగా మార్చుతున్న మాఫియా పేట్రేగిపోతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో బడికి వెళ్ళి చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాల్సిన చిన్నారులు తల్లిదండ్రుల దురాశ, కొందరి యజమానుల అత్యాశతో అడుక్కుంటూ వీధుల పాలవతున్నారు. బిక్షమెత్తుకుంటున్న బాలలు పెరిగి ఇదే వాతావారణంలో పెద్దయ్యాక ఆయా తల్లిదండ్రులు, యజమానుల సంరక్షణలో వీరిని సంఘవిద్రోహ శక్తులుగా మార్చేందుకు వెనుకాడరు.





పసి బిడ్డతో బిక్షాటాన చేస్తున్న మహిళ




### దుకాణాలలో మగ్గిపోతున్న చిన్నారులు

పట్టణంలో పలు దుకాణాలలో, కూరగాయల మార్కెట్ నందు చిన్నారులను నిబంధనలకు విరుద్ధంగా నామ మాత్రపు జీతాలతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. 14 సంవత్సరాలలోపు పిల్లలు ఎట్టి పరిస్థితులలోను దుకాణాలలో పని చేయడానికి నియమించుకోకూడదు. 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలలోపు పిల్లలు ప్రత్యేక పరిస్థితులలో హానికరమైన ప్రదేశాలలో పని చేయకుండా సాధారణ పరిస్థితుల మధ్య ముందస్తు అనుమతులతో పని చేయవచ్చునని నిబంధనలు ఉన్నాయి. కానీ ప్రతి నెల పట్టణంలో తనిఖీలు చేయ వలసిన బాల కార్మిక నిర్మూలన అధికారులు, వైద్యారోగ్య శాఖ, రెవెన్యూ, ఎంపిడిఓ, మున్సిపాల్టీ సంబంధిత కార్యాలయం అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం చిన్నారుల పాలిట శాపంగా మారింది. దీంతో దుకాణాల యజమానులు ఆడింది ఆటా ఇచ్చింది జీతంగా మారింది. ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రం తనిఖీల పేరిట అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

### సరియైన సిబ్బంది ఆర్థిక వనరులు లేవు -డీసీపిఓ

జిల్లాలో కొత్తగా ప్రత్యేక దత్తత కేంద్రాన్ని ఏర్పాటు చేశారు కానీ ఇప్పటివరకు సరైన సిబ్బందిని ఆర్థిక వనరులను ఏర్పాటు చేయలేదు త్వరలో జిల్లా కలెక్టర్ అదనపు సిబ్బందిని ఆర్థిక వనరులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మా దృష్టికి వస్తే బిక్షమెత్తుకుంటున్న పిల్లలను గుర్తించి ప్రత్యేక దత్తత కేంద్రాలలో ఉంచి వారి బాగోగులు చూసుకుంటాము.

### మా దృష్టికి తీసుకొని వస్తే చర్యలు తీసుకుంటాం

### -బాల కార్మిక నిర్మూలన అధికారులు


ప్రతి బుధవారం బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నారేమోనని తనిఖీలు చేస్తూ ఉంటాము మీ దృష్టికి ఏమైనా వస్తే మాకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాము.

నంద్యాల అర్బన్, సెప్టెంబర్ 20, రిపబ్లిక్ న్యూస్ (పి.రవికుమార్)

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1569: మొఘల్ సామ్రాజ్యపు నాలుగవ చక్రవర్తి జహాంగీర్ జననం (మ.1627).
- 1911: సంఘసంస్కర్త ఆచార్య శ్రీరామ్ శర్మ జననం (మ.1990).(చిత్రంలో)
- 1914: తెలుగు శాస్త్రవేత్త, ఎ.యస్.రావుగా ప్రసిద్ధుడైన అయ్యగారి సాంబశివరావు జననం (మ.2003).
- 1924: తెలుగు సినిమా నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు జననం (మ.2014).
- 1944: భారత పార్లమెంటు సభ్యుడు అన్నయ్యగారి సాయిప్రతాప్ జననం.
- 1999: తమిళ సినిమా నటి టి.ఆర్.రాజకుమారి మరణం (జ.1922).


జహాంగీర్


ఆచార్య శ్రీరామ్ శర్మ


సాంబశివరావు


డా.అక్కినేని నాగేశ్వరరావు


సాయిప్రతాప్


టి.ఆర్.రాజకుమారి

రిపబ్లిక్ స్పోర్ట్స్

## మళ్లీ నిరాశపరిచిన రోహిత్..

### బంగ్లాదేశ్తో జరుగుతున్న తొలి టెస్టులో రోహిత్ శర్మ నిరాశపరిచాడు.



బంగ్లాతో జరుగుతున్న తొలి టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నిరాశపరిచాడు. తొలి ఇన్నింగ్స్లో హసన్ మహ్మద్ బౌలింగ్ లో ఆరు పరుగులకే రోహిత్ పెవిలియన్ కు చేరాడు. రెండో ఇన్నింగ్స్లో నైనా మెరుగైన ప్రదర్శన చేస్తాడని ఆశించినా.. మూడో ఓవర్లోనే టస్కిన్ బౌలింగ్లో జకీర్కు క్యాచ్ ఇచ్చి రోహిత్(5) ఔటయ్యాడు. తొలి టెస్టులో హిట్మ్యాన్ చేసిన మొత్తం పరుగులు 11 మాత్రమే. తొలి ఇన్నింగ్స్ లో జైస్వాల్ మినహా టాప్ ఆర్డర్ కుప్పకూలినప్పటికీ.. అశ్విన్ (113), జడేజా (86) చెలరేగి ఆడటంతో భారత్ పటిష్ట స్థితిలో నిలిచింది. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్లో భారత్ 6 ఓవర్లకు వికెట్ నష్టానికి 23 పరుగులతో ఆడుతోంది. అంతకుముందు భారత బౌలర్లు విజృంభించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్ లో 149 పరుగులకే ఆలౌట్ అయ్యింది.

## భారత బౌలర్ల ధాటికి బంగ్లా చిత్తు

### భారత బౌలర్ల దాటికి తొలి ఇన్నింగ్స్లో బంగ్లా చేతులెత్తేసింది.

చెపాక్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ పై టీం ఇండియా పట్టు సాధించింది. భారత బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్ లో ప్రత్యర్థి బ్యాటర్లు చేతులెత్తేశారు. 149 పరుగులకే ఆలౌట్ అయ్యారు. బుమ్రా నేతృత్వంలోని పేస్ దాడికి.. బంగ్లా బ్యాటర్లు క్రీజులో నిలువలేకపోయారు. బంగ్లా ఇన్నింగ్స్లో షకీబ్(32)దే అత్యధిక స్కోరు. మిరాజ్ 27, లిట్టన్ దాస్ 22, షాంటో 20 పరుగులు చేయగా.. మిగతావారు నామమాత్రపు స్కోరుకే పరిమితమయ్యారు. బుమ్రా నాలుగు వికెట్లు తీయగా, ఆకాశ్ దీప్, జడేజా, సిరాజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు టీమ్ ఇండియా మొదటి ఇన్నింగ్స్ లో 376 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్ ఆరంభంలో రోహిత్ సేన తడబడ్డా.. అశ్విన్ (113), జడేజా (86) చెలరేగి ఆడటంతో భారత్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. ప్రస్తుతం బంగ్లాపై భారత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 227 పరుగులుగా ఉంది.

### బంగ్లా బ్యాటర్లకు చుక్కలు..


భారత్ ఆలౌట్ అనంతరం రెండో రోజు మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా బ్యాటర్లకు ఆతిథ్య బౌలర్లు చుక్కలు చూపించారు. బుమ్రా - సిరాజ్ ఆకాశ్ దీప్ కట్టుదిట్టమైన బౌలింగ్తో బంగ్లాను ముప్పుతిప్పలు పెట్టారు. తొలి ఓవర్లోనే కళ్లు చెదిరే ఇన్ స్వింగర్ ఓపెనర్ షద్మాన్ (2)ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత జకీర్ హసన్ (3), మోమినల్ హక్ (0)ను వరుస బంతుల్లో ఆకాశ్ దీప్ బౌల్డ్ చేసి పెవిలియన్కు చేర్చాడు. కెప్టెన్ షాంటో (20) కాసేపు క్రీజ్లో ఉన్నా.. మళ్లీ భారత బౌలర్ల దెబ్బకు బంగ్లా వరుసగా వికెట్లను చేజార్చుకుంది. షాంటోతోపాటు ముష్ఫికర్ రహీమ్ (8) ఔట్ కావడంతో బంగ్లా ఇన్నింగ్స్ ఇంకాస్త వేగంగా కుప్పకూలుతుందని అంతా భావించారు. కానీ, షకిబ్ అల్ హసన్ (32), లిటన్ దాస్ (22) ఆరో వికెట్కు 51 పరుగులు జోడించారు. తన వరుస ఓవర్లలో రవీంద్ర జడేజా అద్భుతమైన బంతులతో వారిద్దరిని ఔట్ చేసి భారత్కు మళ్లీ బ్రేక్ ఇచ్చాడు.



## హెూమ్ డెకరేషన్

# ఈ ఫుడ్స్ తింటే త్వరగా బరువు పెరుగుతారు

**త్వరగా బరువు తగ్గాలని ఎంత మంది కోరుకుంటారో.. అలానే స్పీడ్గా బరువు పెరగాలని కూడా అంతేమంది కోరుకుంటారు. బరువు పెరగాలనుకునేవారు ఏం చేస్తే లాభాలుంటాయో తెలుసుకోండి. బరువు తగ్గాలనుకున్నా, పెరగాలనుకున్నా నేచురల్గానే జరగాలి. అంతేకానీ, మెడిసిన్స్ వంటివి తీసుకుంటే అది అంత మంచిదికాదు. దీని వల్ల చాలా సమస్యలొస్తాయి. మనం తీసుకునే ఫుడ్స్ కూడా బరువు పెరగడానికి హెల్ప్ చేస్తాయి. ఇందులో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్, హెల్దీ ఫ్యాట్స్, ప్రోటీన్స్ ఎక్కువగా ఉండే ఫుడ్స్ ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల బరువు పెరుగతారు. అవేంటో తెలుసుకోండి.**



### అన్నం..

బియ్యంలో ఎక్కువగా కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. వైట్ రైస్, బ్రౌన్రైస్లో కొద్దిగా ప్రోటీన్ ఉన్నప్పటికీ కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని మరింత హెల్దీగా చేయాలంటే ప్రోటీన్ యాడ్ చేయాలంటే మీట్, బీన్స్ వంటి వాటితో కలిపి తినొచ్చు.



### హెూల్ గ్రెయిన్ బ్రెడ్..

హెూల్ గ్రెయిన్ బ్రెడ్లో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ ఉంటాయి. వైట్ బ్రెడ్ కంటే ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది. దీంతో పాటు నట్ బటర్, అవోకాడోతో కలిపి తీసుకుంటే ప్రోటీన్ కూడా అందుతుంది. వీటితో మీరు శాండ్విచ్ కూడా చేసి ఫుడ్ ఎంజాయ్ చేయొచ్చు.



### హెూల్ గ్రెయిన్ సెరల్స్..

హెూల్ గ్రెయిన్ సెరల్స్లో ఓట్స్, గోదుమలు, బార్లీ, బియ్యం వంటివి ఉంటాయి. వీటిని మీరు పాలు, పెరుగుతో కలిపి తీసుకోవచ్చు. వీటిని మీరే విడివిడిగా తీసుకుని కలుపుకోవచ్చు. లేదంటే ప్రీ మిక్స్ హెూల్గ్రెయిన్స్, హెూల్ గ్రెయిన్ బార్స్ తీసుకోవచ్చు. బయట తీసుకున్నప్పుడు లేబుల్ చదవడం ముఖ్యం..



### డ్రై ఫ్రూట్స్..

డ్రై ఫ్రూట్స్లో ఫ్రక్టోజ్ ఉంటుంది. ఇది పండ్లలోని చక్కెర. అవి సహజ స్వీటెనర్స్గా, భోజనంలో క్యాలరీ కంటెంట్ని పెంచుతాయి. హెూల్గ్రెయిన్స్, ఓట్స్ని డేట్స్తో తీసుకోవచ్చు. పెరుగులో డ్రైడ్ ఆప్రికాట్స్ కలిపి తినొచ్చు. డ్రైడ్ ఫ్రూట్స్ని స్మూతీతో కలిపి తీసుకోవచ్చు.



### డార్క్ చాక్లెట్..



ఇవి కోకోబీన్స్తో తయారయ్యే చాక్లెట్. కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే కోకోబీన్స్తో తయారైన డార్క్ చాక్లెట్ని మిల్క్ చాక్లెట్తో పోలిస్తే తక్కువ షుగర్, ఎక్కువ కోకో కంటెంట్ ఉంటుంది. కోకో బీన్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి.

### వీటితో పాటు..

అదే విధంగా, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే.. బంగాళాదుంప, పాస్తాజి, స్వీట్ పొటాటో, స్క్వాష్ కార్న్, చిక్కుళ్ళు, బీన్స్, శనగలు, పిండి పదార్థాలలో గ్లూకోజ్ పుష్కలంగా ఉంటుంది.



### ఒక్కసారిగా పెరిగితే..

వీటిని తినడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే, ఒక్కసారిగా పెరగడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. మీరు తక్కువ బరువు ఉంటే డాక్టర్ని సంప్రదిస్తే మిమ్మల్ని పరీక్షించి ఏం తినాలి.. ఎలా తినాలి నెలకి ఎన్ని కిలోలు పెరగాలో సూచిస్తారు. ఆ విధంగానే పెరగాలి. లేదంటే ఆరోగ్య సమస్యలొస్తాయని గుర్తుపెట్టుకోండి. గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

